2nd Anniversary

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in




బీఆర్ఎస్ నిరసన గళం 2



వినాయకుని ఆకృతిలో విద్యార్థులు 3



'ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక'.. సిద్ధాంతంతో సరిగ్గా రెండేళ్ల కిత్రం 'అక్షరటుడే' పురుడు పోసుకుంది. డిజిటల్ మాధ్యమం పరిధి పెరిగిన నేటి రోజుల్లో ప్రింట్ మీడియాకు నానాటికి ఆదరణ తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలోనే 'అక్షరటుడే' డిజిటల్ మీడియాను ప్రారంభించాం. ప్రధానంగా వేగవంతమైన సమాచారం, కచ్చితత్వం, నమ్మకం, విలువలే లక్ష్యంగా నడిపిస్తున్నాం. కాగా.. ప్రారంభించిన అనతికాలంలోనే లక్షలాది మంది పాఠకులకు చేరువయ్యాం. ప్రాంతీయ వార్తల నుంచి అంతర్జాతీయ వార్తల సమాహారంతో పాఠకుల ఆదరాభిమానాలను చూరగొనడం ఎంతో ఆనందంగా భావిస్తున్నాం. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలతో పాటు, ప్రజల జీవన రీతిపై ప్రభావం చూపే కథనాలు అందించడమే ధ్యేయంగా ముందుకు పయనిస్తున్నాం. శర వేగంగా దూసుకుపోతున్న డిజిటల్ మీడియా ప్రపంచంలో.. విశ్వసనీయత, సమగ్రతే ధ్యేయంగా ప్రతి క్షణం పాఠకులకు వార్తలు, కథనాలు అందిస్తున్నాం. ఈ రెండేళ్ల కాలంలో 'అక్షరటుడే' కేవలం ఓ డిజిటల్ మీడియా ప్లాట్‌ఫాంగానే కాకుండా, ప్రజల అభిప్రాయాలకు ఓ చక్కటి వేదికగా మారింది. ఈ వసంతాలు మా వెన్నంటి నడిచిన సిబ్బంది.. మమ్మల్ని ఆదరించిన పాఠకులు, ప్రకటనకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

అతి త్వరలోనే మీ అందరి ఆదరాభిమానాలతో నూతన ఒరవడితో ముందుకు రాబోతున్నామని ప్రకటించేందుకు గర్విస్తున్నాం. ఇదే ఆదరణను మున్ముందు కొనసాగిస్తారని ఆశిస్తూ..

మీ

అక్షరటుడే యాజమాన్యం



# కవితను కారు నుంచి దించేశారు..

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. గులాబీ అధిపతి కేసీఆర్ కూతురుగా, మహిళా నేతగా కవిత పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తనకంటూ కేడర్‌ను కూడగట్టుకున్నారు. కాగా పార్టీ అధిష్టానం తాజాగా ఆమెపైనే వేటు వేయడంతో శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆమె వెంట నడిచేదెవరో? కేవలం జాగృతికే పరిమితం అవుతారా? ఇన్నాళ్లు మద్దతు ఇచ్చిన సైతం ఆమెకు షాకిస్తారా అనేది అతి త్వరలోనే తేలనుంది. -అక్షరటుడే, ఇందూరు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బీఆర్ఎస్ అధినాయకత్వం మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో హరీశ్‌రావు, సంతోష్‌రావు పాత్ర ఉందని ఆమె వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో సొంత పార్టీ నుంచి ఆమె తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో హుటాహుటిన పార్టీ ముఖ్య నేతలు గులాబీ బాస్ కేసీఆర్ సూచనల మేరకు కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్యేకించి కొద్ది రోజులుగా సొంత పార్టీపై ముఖ్యంగా తన సోదరుడు కేటీఆర్‌తో పాటు హరీశ్‌రావు, సంతోష్ రావులను ఉద్దేశించి కవిత ఘాటైన విమర్శలు చేస్తున్నారు. ఈ వ్యాఖ్యలతో బీఆర్ఎస్‌కు నష్టం జరుగుతుందని భావించిన హైకమాండ్ ఎట్టకేలకు కవితపై సస్పెన్షన్ వేటు వేసింది.

### ఇందూరు నుంచే..

కవిత ప్రస్తుతం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. తాజాగా ఆమెపై వేటు పడటంతో ఉమ్మడి జిల్లాలోని ఆమె అనుచరులు వెంట నడుస్తారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. కాగా కవిత తన రాజకీయ జీవితాన్ని నిజామాబాద్ జిల్లా నుంచే ప్రారంభించారు. ఆమె 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. జాగృతి ద్వారా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. 2014లో ఆమె నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. దీంతో ఆమె కంటూ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో పలువురు అనుచరులు ఉన్నారు. అయితే 2019 ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కేసీఆర్ అవకాశం ఇచ్చారు. 2020 అక్టోబర్‌లో కవిత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కాగా 2024 ఎన్నికల్లో పోటీ చేయడానికి భావించినా.. లిక్కర్ కేసులో అరెస్టయి జైలులో ఉండటంతో పోటీ చేయలేకపోయారు.

### ఓడిన నాటి నుంచి..

కవిత నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో జిల్లాలో పార్టీకి ఆమెనే పెద్దదిక్కుగా కొనసాగారని చెప్పవచ్చు. ప్రతి కార్యక్రమంలో ఆమె పాల్గొనేవారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆమెకు భారీగానే అనుచరులు ఉన్నారు. అయితే 2019 ఎన్నికల్లో ఓడిపోయిన నాటి నుంచి ఆమె జిల్లాపై పెద్దగా ఫోకస్ పెట్టలేదు. ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్నా కూడా అంతంత మాత్రంగానే కార్యక్రమాలకు హాజరయ్యారు. అలాగే జైలు నుంచి బయటకు వచ్చాక పార్టీలో దెయ్యాలు ఉన్నారంటూ కుటుంబీకులను ఉద్దేశించి కవిత పలు ఆరోపణలు చేశారు. కేటీఆర్‌తోనూ విబేధాలు ఉన్న కారణంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని చర్చ సాగింది. తాజాగా కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలనే ప్రభుత్వ నిర్ణయం అనంతరం ఆమె చేసిన వ్యాఖ్యలు అటు పార్టీలోనూ.. రాష్ట్ర రాజకీయాల్లోనూ దూమారం రేపాయి. దీంతో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు.

### అనుచరుల్లో అయోమయం

తాజా పరిణామాల నేపథ్యంలో కవిత అనుచరుల్లో అయోమయం నెలకొంది. తాము పార్టీని వదిలి ఆమె వెంట వెళ్తే తమ భవిష్యత్ ఏమిటని ఆలోచిస్తున్నారు. అలాగే ఆమె కొత్త పార్టీ పెడతారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఓ జాతీయ పార్టీలో చేరుతారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. కాగా బుధవారం మధ్యాహ్నం కవిత మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తన భవిష్యత్ కార్యాచరణపై ఆమె కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని, అలాగే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలో కవిత అనుచరులు పార్టీని వీడి ఆమె వెంట వెళ్తారా.. లేక ఒంటరిగా వదిలేసి పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా వేచి చూడాలి.




















డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్


ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్


వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద..


బాన్సువాడలో..


నిజామాబాద్ నగరంలో..


ఆర్మూర్ పట్టణంలో..

# బీఆర్ఎస్ నిరసన గళం

బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించడంతో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు నిరసనలు తెలిపారు. రోడ్లపైకి వచ్చిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్‌పై కక్షసాధింపులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రవర్తిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

## కామారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి..!



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కామారెడ్డిలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. అలాగే ఎల్లారెడ్డి, నిజాంసాగర్, బాన్సువాడ ప్రాంతాల్లోనూ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. ప్రాజెక్టులకు వరద పోటెత్తడంతో దిగువకు వరదను విడుదల చేశారు. అయితే ప్రాజెక్టుల పరీవాహక ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయి. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా కామారెడ్డిలో వరద కారణంగా అపారనష్టం వాటిల్లింది. వర్ష బీభత్సం సృష్టించిన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏరియాల్ సర్వే చేశారు. తాజాగా ఆయన ఎల్లారెడ్డిలో ముంపునకు గురైన పలు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఈనెల 4న లింగంపేట మండలానికి హెలికాప్టర్ ద్వారా వచ్చి అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి ప్రాజెక్టు, బొగ్గుగుడిసె ప్రాంతాన్ని పరిశీలిస్తారు. అనంతరం నాగిరెడ్డిపేట మండలం పోచారం ప్రాజెక్టు వద్ద వరద తాకిడికి కొట్టుకుపోయిన వంతెనను, ప్రాజెక్టు ఓవర్ హెడ్ వద్ద మట్టి కొట్టుకుపోయిన ప్రాంతాన్ని సీఎం పరిశీలించనున్నారు. ఆ తర్వాత అగ్రికల్చర్ కళాశాలలో అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించనున్నారు. కాగా.. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు విద్యుత్ సంబంధిత ఏర్పాట్లను ట్రాన్స్‌కో ఎస్ఈ పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.

## హన్మాజిపేట్ పాఠశాలలో వైద్య శిబిరం

**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని హన్మాజిపేట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన కల్పించి, శుభ్రత, పోషకాహారం, వ్యాధి నిరోధకత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో వైద్యాధికారి ఇమ్రాన్, హెచ్ఈవో రవి, సూపర్ వైజర్ పాప, ఎంఎల్‌హెచ్‌పీలు తిరుమలేష్, హేమ బిందు, ఆరోగ్య కార్యకర్తలు విఠవ్వ, మంజుల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## గణేష్ నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గణేష్ నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి మంగళవారం ఆయన గణేష్ నిమజ్జనం నిర్వహించనున్న టేక్రియాల్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణాన్ని ఆనుకొని ఉన్న టేక్రియాల్ చెరువులో గణేష్ నిమజ్జనం సందర్భంగా దాదాపు 700లకు పైగా విగ్రహాలను నిమజ్జనం చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చెరువు వద్ద ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువులోకి ఎవరు పడితే వారు వెళ్లకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వినాయకులను నిమజ్జనం చేయడానికి పెద్ద క్రేన్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. వాటర్ ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేసి రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, ఫిషరీస్, ఫైర్ తదితర శాఖలతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. వినాయకులకు తగలకుండా విద్యుత్ వైర్ల ఎత్తును పెంచాలని, విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువుకు వచ్చే రహదారికి మరమ్మతులు చేసి సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 4, 5, 6 తేదీల్లో అధిక సంఖ్యలో వినాయకులు వస్తాయని, పకడ్బందీగా



పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి వరుస క్రమంలో వినాయకులను నీళ్లలో వేసేలా పర్యవేక్షించాలని సూచించారు. కామారెడ్డి ఆర్డీవో, తహశీల్దార్, పోలీస్, ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం టేక్రియాల్‌లో వినాయకులు వచ్చే రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో కామారెడ్డి సబ్‌డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి ఆర్డీవో వీణ, తహశీల్దార్ జనార్ధన్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్, ఆర్అండ్‌బీ, ఫిషరీస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలి

**అక్షరటుడే, బాన్సువాడ :** భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. మండలంలోని సంగోజిపేటలో ఇటీవల వర్షాలకు ధ్వంసమైన రోడ్లను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా రోడ్ల మరమ్మతు పనులను వేగంగా పూర్తిచేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మతులు వేగంగా పూర్తిచేసి గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో ఆనంద్, పీఆర్ ఏఈ, మాజీ ఎంపీటీసీ జెట్టి హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు. భారీ వరదల కారణంగా బాన్సువాడ నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. ముఖ్యంగా రహదారులన్నీ ఛిద్రమయ్యాయి. ఇప్పటికే వ్యవసాయాధికారుల నష్టపోయిన పంటల వివరాలు సేకరిస్తున్నారు. త్వరలోనే నివేదికను అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు.


సంగోజిపేటలో ధ్వంసం అయిన రోడ్డును పరిశీస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి






























## వినాయకుని ఆకృతిలో విద్యార్థులు

గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని బాల్కొండ మండల కేంద్రంలోని మదర్ థెరిసా, శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ విద్యార్థులు వినాయకుని ఆకృతిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ రామలక్ష్మి అభినందించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు. – అక్షరటుడే, భీమ్‌గల్

## పంట నష్టం పరిశీలన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి, తిమ్మారెడ్డి, అన్నాసాగర్, లింగారెడ్డిపేట, ఎల్లారెడ్డి, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, హాజీపూర్, అడవి లింగాల్, లక్ష్మాపూర్, కొట్టాల్ గ్రామాల్లో పంటలు నేల కొరిగాయి. దీంతో మంగళవారం మండల వ్యవసాయ అధికారి నజుముద్దీన్, సహాయ వ్యవసాయ అధికారి రాజా గౌడ్, రైతులతో కలిసి పంటలు పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం 2200 ఎకరాల్లో వరి పంటనష్టం జరిగినట్లు ఏవో తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతుల వారిగా వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

## ఎంపీ అర్వింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ



**అక్షరటుడే ఇందల్వాయి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు ఎంపీ అర్వింద్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బీజేపీ ఇందల్వాయి మండలాధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీ అర్వింద్ ఫౌండేషన్ తరపున మంగళవారం పలువురు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండలంలోని గండితండాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో బీజేపీ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాక్లూర్ హత్యల కేసులో ముగ్గురికి జీవితఖైదు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో సంచలనం సృష్టించిన మాక్లూర్ హత్యల కేసులో నిందితులకు న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన ప్రసాద్, సాన్విక దంపతులతో పాటు వారి పిల్లలైన చైత్రిక, చైత్రిక్, ప్రసాద్ చెల్లెళ్లు స్వప్న, శ్రావణి మొత్తం ఆరుగురు వివిధ ప్రాంతాల్లో హత్యకు గురయ్యారు. ప్రసాద్, ప్రశాంత్ స్నేహితులు. ప్రసాద్‌కు భారీగా అప్పులు అయ్యాయి. దీంతో బ్యాంక్‌లో లోన్ ఇప్పిస్తానని ప్రశాంత్ నమ్మించాడు. ప్రసాద్ ఇంటిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తే లోన్ ఇప్పిస్తానని చెప్పాడు. దీంతో నమ్మిన ప్రసాద్ తన ఇంటిని మెడిద ప్రశాంత్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆయన లోన్ ఇప్పించక పోగా అడిగిన ప్రతిసారి దాటవేశాడు. దీంతో గట్టిగ నిలదీయడంతో ఆ కుటుంబాన్ని మొత్తం హత్య చేస్తే ఆ ఇల్లు తనకు దక్కుతుందని పథకం వేశాడు. తన తల్లి ఒడ్డెమ్మ, వంశీకృష్ణ, తన తమ్ముడు(మైనర్) సాయంతో ప్రశాంత్ ఆరుగురిని హత్య చేశాడు. ప్రశాంత్, అతడి తమ్ముడు, వంశీకృష్ణ, ఒడ్డెమ్మలు కలిసి ఈ ఆరుగురిని హత్య చేసినట్లుగా పోలీసులు ఆధారాలు సేకరించి కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రసాద్‌ను 2023వ తేదీ నవంబర్ 29న మదన్‌పల్లి అటవీప్రాంతంలో నిందితుడు ప్రశాంత్ బండరాయితో కొట్టి హత్య చేశాడు. అనంతరం ప్రసాద్ ఎక్కడున్నాడో చూపిస్తామంటూ ఆయన భార్య సాన్వికను కారులో తీసుకెళ్లి నవీపేట్ మండలం జగ్గారావు ఫారం వద్ద వద్ద తాడుతో ఉరి వేసి హత్య చేశారు. బాసర వంతెన క్రింద ఆమె మృతదేహాన్ని పడవేశారు. అనంతరం వారి ఇద్దరు కవల పిల్లలైన చైత్రిక, చైత్రిక్‌లను ప్రసాద్ చెల్లెళ్లయిన స్వప్న, శ్రావణిలను సైతం ఈ ముగ్గురు వేరువేరు ప్రాంతాల్లో దారుణంగా హత్య చేశారు. ప్రసాద్ తల్లిని కూడా హత్య చేయాలని ప్రశాంత్ ప్లాన్ వేశాడు. అయితే ప్రశాంత్ తీసుకెళ్లిన వారు ఎవరు తిరిగి రాకపోవడంతో ఆమె అనుమానం వచ్చి అతడి నుంచి తప్పించుకుంటుంది. అప్పట్లో ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ముగ్గురు కలిసి ఏకంగా ఆరుగురిని హత్య చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి ముగ్గురు నిందితులైన ప్రశాంత్, వంశీకృష్ణ, ఒడ్డెమ్మలకు జీవిత ఖైదుతో పాట, దోపిడీ నేరానికి గాను.. పదేళ్ల జైలు, మోసం చేసినందుకు గాను ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అనుభవించాలని తీర్పు వెలువరించారు.

## అనారోగ్యంతో పీజీ విద్యార్థిని మృతి

**అక్షరటుడే, ఇందల్వాయి:** అనారోగ్యంతో ఓ పీజీ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన ఇందల్వాయి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ రవి కుమార్తె సంజన (21) హైదరాబాద్‌లో పీజీ అభ్యసిస్తోంది. వారం రోజుల క్రితం ఆమె అనారోగ్యానికి గురికాగా.. తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అయితే మూడురోజులుగా కోమాలో ఉన్న సంజన మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువుతూ.. ఉజ్వల భవిష్యత్తు ఉన్న అమ్మాయి అకాలమరణం చెందడంతో ఆమె కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.



నిజామాబాద్‌లో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బాన్సువాడలో..

## వైఎస్సార్‌కు ఘన నివాళులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని ఉమ్మడి జిల్లాలో నిర్వహించారు. నిజామాబాద్, బాన్సువాడ, ఆర్మూర్, ఆలూరు, గాంధారిలో వైఎస్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి అందరివాడని, బడుగు బలహీనవర్గాలకు, ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం ఆలోచించే గొప్ప నాయకుడని కొనియాడారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆసరా పెన్షన్, అభయహస్తం, ఇందిరమ్మ ఇళ్లు, 108 తదితర సంక్షేమ పథకాలు అమలు చేసిన గొప్ప వ్యక్తి అన్నారు.

–అక్షరటుడే, బాన్సువాడ



గాంధారిలో..



ఆర్మూర్‌లో..



ఆలూరులో..

## శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరుపుకోవాలి



**అక్షరటుడే, ఇందల్వాయి:** గణేష్ నిమజ్జనోత్సవం శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ సూచించారు. మంగళవారం ఇందల్వాయి పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. నిమజ్జనం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ శాంతియుతంగా వినాయక నిమజ్జనం నిర్వహించాలని కోరారు. ఎక్కడైనా ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, హిందూ, ముస్లిం మత పెద్దలు, తదితరులున్నారు.

## ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనాన్ని జరుపుకోవాలి



**అక్షరటుడే, ఇందూరు:** భక్తులు శాంతియుత వాతావరణంలో వినాయకుడి ఉత్సవాలు జరుపుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నిజామాబాద్ నగరంలో మంగళవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి గణేశ్ శోభాయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిమజ్జనానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం వినాయక్ నగర్‌లోని వినాయకుల బావి వద్ద ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతం నుంచి శోభాయాత్ర ప్రారంభం కానుండగా, భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే యంచ శివారులోని గోదావరి బ్రిడ్జి వరకు గల మార్గాన్ని కలెక్టర్, సీపీ సంయుక్తంగా పరిశీలించారు. ఉమ్మెడ మార్గాన్ని, బ్రిడ్జి వద్ద గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. యంచ గోదావరి బ్రిడ్జితో పాటు, ఉమ్మెడ వద్ద భారీ విగ్రహాల నిమజ్జనం కోసం సరిపడా క్రేన్లను, తగిన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్, సీపీ సిబ్బందికి సూచించారు. అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్ కుమార్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వియా, నిజామాబాద్ అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మస్తాన్ రావు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ప్రమాణ స్వీకారం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ పరిధిలోని గాంధీనగర్‌లో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ మేరకు ఎన్నికైన విద్యార్థులకు మంగళవారం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నాయకులను తయారు చేసేవారే నిజమైన నాయకులన్నారు. పాఠశాల పాలనాధికారి పద్మ, ఎన్నికల అధికారి నాగరాజు, పాఠశాల ఇన్‌చార్జి శ్రుపన్, అకడమిక్ కోఆర్డినేటర్ రమేష్, నవీన్, గంగామణి, శివ పాల్గొన్నారు.



## టెండర్ల స్వీకరణలో గందరగోళం..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న ఎల్లారెడ్డి నూతన బస్టాండ్‌లో షాపుల టెండర్ దరఖాస్తు స్వీకరణ ప్రక్రియలో గందరగోళం నెలకొంది. నిజామాబాద్ ఆర్టీసీ కార్యాలయంలో అధికారుల తీరుతో గందరగోళం ఏర్పడినట్లు దరఖాస్తుదారులు తెలిపారు. ఎల్లారెడ్డి బస్టాండ్‌ను ఇటీవల నిర్మించారు. బస్టాండ్ పరిధిలో 10 షాపులను నిర్మించగా వీటికి మంగళవారం టెండర్లు నిర్వహించి డీడీలు స్వీకరించారు. టెండర్ల విషయంలో కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో డీడీలు కట్టిన వారు తమ వెనక్కి ఇవ్వాలని కోరారు. దీనికి ఆర్టీసీ అధికారులు నిరాకరించారు. డీడీలను తర్వాత ఇస్తామని చెప్పారు. దీంతో అధికారుల తీరును నిరసిస్తూ ఆర్టీసీ అధికారులతో వాగ్వాదం చేశారు.

## సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో వజ్రాయుధం అని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. సమాచార హక్కుచట్టంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు బోర్డులను ఏర్పాటు చేసి, సంబంధిత అధికారుల పేర్లను నమోదు చేయాలని కోరారు. రాష్ట్ర స్పోక్స్‌పర్సన్ న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం పరిధిని విస్తరించాలని పేర్కొన్నారు. అలాగే చట్టం దరఖాస్తు విధానాన్ని సెక్షన్ 6(1) మరియు సెక్షన్ 19(1) రెండవ పిల్ 19 (3 ) సమాచారాన్ని ఇవ్వని అధికారులపై రాష్ట్ర కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే జరిమానా విధించే అధికారం రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కాంతపు గంగాధర్, మహిళ అధ్యక్షురాలిగా సునీత, న్యాయ విభాగ సలహాదారులుగా శ్యామల, నిజామాబాద్ జిల్లా కార్యదర్శిగా రషీద, జిల్లా ముఖ్య సలహాదారులుగా మహమ్మద్, బోధన్ డివిజన్ అధ్యక్షురాలిగా తస్లీమ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడి అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పలు చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామానికి చెందిన గుండ్రెడ్డి గంగాధర్ తన అత్తమ్మతో పనినిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. అయితే జులై 19న తన తల్లిగారి ఇంటి గేటుతో పాటు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో గంగాధర్ భార్య ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 2 తులాల బంగారు చైన్, రూ.25వేల నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే అదే గ్రామానికి చెందిన గుర్రపు మహేష్ తన ఇంట్లో కిరాణా షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. జులై 18న రాత్రి దుకాణం మూసివేసి 19న చూడగా షాపు తాళం పగులగొట్టి ఉండడంతో కౌంటర్‌లో చూడగా రూ.12వేల నగదు కనిపించలేదు. రెండో గదిలో బీరువాలో ఉన్న 2 తులాల పుస్తెలతాడు కూడా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సీసీ ఫుటేజీ ప్రకారం విచారణ చేపట్టి నిందితులను పట్టుకున్నారు.





## బీర్కూర్‌లో టీఎల్ఎం మేళా

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూరు మండల ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళా బీర్కూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ రిబ్బన్ కట్ చేసి మేళాకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకన్న మాట్లాడుతూ, టీఎల్ఎం ఉపయోగించి బోధించడం ద్వారా విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారని, ఇలాంటి మేళాలు ఉపాధ్యాయుల్లో సృజనాత్మకత పెంపొందించి, వినూత్నరీతిలో బోధనా పద్ధతులు అవలంభించేందుకు దోహదపడతాయన్నారు. దీంతో విద్యార్థుల అభ్యసన ఫలితాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు, యమ రాములు, బస్వరాజ్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు హెల్మెట్ల అందజేత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** గోపాలపల్లికి చెందిన బెన్ని ఆధ్వర్యంలో గ్రామస్థులు పలువురికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. తన కూతురు అద్విక పుట్టినరోజు సందర్భంగా తనవంతు సామాజిక బాధ్యతగా 60 హెల్మెట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, సీఐ ప్రసాద్ గ్రామపెద్దల చేతులమీదుగా హెల్మెట్లను అందజేశారు. అనతరం సీఐ మాట్లాడుతూ.. వాహనదారులకు హెల్మెట్ ఉచితంగా అందించడంపై అభినందించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## అంతర్రాష్ట్ర దొంగపై పీడీ యాక్ట్ నమోదు

**అక్షరటుడే, కామారెడ్డి:** అంతర్రాష్ట్ర దొంగపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు మంగళవారం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. లింగంపేట్ మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన గారబోయిన శ్రీకాంత్ ప్రస్తుతం నిజామాబాద్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ మేరకు పీడీ యాక్ట్ నమోదు చేసిన ప్రతిని ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నర్సింలు అతడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిందితుడు శ్రీకాంత్ అంతర్రాష్ట్ర దోపిడీలు, దొంగతనాలతో పాటు లింగంపేట్ మండలంలో అమ్ముల లక్ష్మి అనే మహిళను ఆభరణాల కోసం హత్య చేసినట్లుగా గుర్తించామన్నారు.. అరెస్ట్ సమయంలో బంగారు, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారని, పీడీ యాక్ట్ ప్రకారం శ్రీకాంత్ ఒక ఏడాది పాటు బెయిల్ లేకుండా జైల్లో ఉంటాడని తెలిపారు. తరచూ నేరాలకు పాల్పడే వారు సమాజంలో భయాందోళనలు కలిగిస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా శాంతి, సామరస్యాన్ని నెలకొల్పుతామని ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.